క్లుప్తంగా

సమయ పాలన తప్పనిసరి

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ నగర పాలక కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని కంప్యూటర్ విభాగంలో ఉద్యోగుల హాజరును పరిశీలించారు. కొత్త ఆర్థిక సంవత్సరం నేపథ్యంలో ఈఆర్పీ లాగిన్లు, అకౌంట్స్ విభాగానికి సంబంధించిన పనులపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని, అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

పల్లకిపై వెన్న కృష్ణుడి విహారం



పల్లకిలో ఊరేగుతున్న వెన్నకృష్ణుడు

చిత్తూరు రూరల్: నగరంలోని రాములుగుడివీధిలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి అభిషేక పూజలు చేయించారు. ఉత్సవ మూర్తిని వెన్న కృష్ణుడి అలంకరణలో నగర వీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు పులకించిపోయారు. రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై విహరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని 35వ డివిజన్ ఖాదర్‌మీరాన్‌వీధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించనున్నారు. మారియమ్మన్‌గుడి వద్ద నుంచి గడప గడపకూ వెళ్లి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజాసమస్యలు తెలుసుకుంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. ఆస్తిపన్నుపై ఐదు శాతం రాయితీ అవకాశం ఈ ఏప్రిల్ నెలాఖరుకు ముగుస్తుందన్నారు. ఈ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించి.. అసలులో 5 శాతం రాయితీ పొందాలని సూచించారు. పన్నులను నగరపాలక సంస్థ కార్యాలయంలోని పురసేవ కౌంటర్ వద్ద, సంబంధిత వార్డు సచివాలయాల్లోనూ చెల్లించవచ్చని చెప్పారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు



వినాయకుని సన్నిధిలో విజయనగరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అప్పలనాయుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని విజయనగరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు దర్శించుకున్నారు. వారు గురువారం కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పూతలపట్టు: విద్యార్థులు యవ్వన కాలంలోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణశేఖర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ఆర్‌వీఎస్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



గుడిపాల: మండలంలోని వసంతాపురం సచివాలయ పరిధిలో సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. మండల సచివాలయ కన్వీనర్ సాయి మాట్లాడుతూ 7వ తేదీ నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని కోరారు.

ప్రత్యేక బృందాల నియామకం

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో బంగారు దోపిడీ కేసు విచారణకు ప్రత్యేకంగా నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో నిఘా పెంచామని, దీంతోపాటు వాహనాల తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు.

నాణ్యంగా, నిరంతరాయంగా..

- చురుగ్గా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు
- దాదాపు పూర్తి కావస్తున్న పనులు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో ఇంట్లో ఉండాలంటే ఖచ్చితంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ ఉండాల్సిందే. ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరుగుతుంది. నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడానికి అధికారులు నిర్వహణ పనులు చేపడుతున్నారు. ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో లైన్ సర్వే చేశారు. ఎక్కడెక్కడ లైన్లు, స్తంభాలు, కండక్టర్లు అవసరమో గుర్తించారు. అవసరమైన చోట సామర్థ్యం పెంపు నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 265 విద్యుత్ స్తంభాలు, 2 కిలోమీటర్లు లైన్ అవసరమని గుర్తించారు. పనులు దాదాపు 80 శాతం పూర్తి చేశారు. నెలలోపు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా పంపిణీ చేయనున్నారు.

వేగంగా పనులు

చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో పలు ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ లైన్లలో కాలం చెల్లిన స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో మరమ్మతు అయిన విద్యుత్ సామగ్రిని మారుస్తున్నారు. లైన్లలో స్తంభానికి, స్తంభానికి మధ్య దూరం అధికంగా ఉండడంతో లూజ్ స్పేస్ ఏర్పడుతుంది. దీంతో వర్షాలు కురిసేటప్పుడు, చిన్న పాటి గాలులకు సైతం విద్యుత్ వైర్లు కలిసిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఆ సమస్యకు చెక్‌పెట్టేందుకు ఆయా పోల్స్ మధ్య అదనంగా పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను సిబ్బందిని సరిచేస్తున్నారు.



సంతపేటలో చెట్లకొమ్మలు నరుకుతున్న విద్యుత్ సిబ్బంది

నెలరోజుల్లో పనులు

క్షేత్రస్థాయిలో 150 మంది సిబ్బంది పనులు చేస్తున్నారు. సెక్షన్ల వారీగా కాలం చెల్లిన విద్యుత్ లైన్లు పునరుద్ధరించేందుకు అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నారు. నగరంలోని కొంగారెడ్డిపల్లె, సంతపేట, గిరింపేట, మిట్టూరు, గుడిపాల, చిత్తూరు రూరల్, రెడ్డిగుంట, పూతలపట్టు, జీడీనెల్లూరు, పెనుమూరు, పాలసముద్రం, ఎస్ఆర్‌పురం, ఆవులకొండ, కొత్తపల్లె సెక్షన్ల పరిధిలో దాదాపు 2 లక్షల వరకు సర్వీసులున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు విద్యుత్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 265 విద్యుత్ స్తంభాలు, 753 ప్రాంతాల్లో ట్రీ కటింగ్, 2 కిలోమీటర్లు కండక్టర్లు మార్పు చేస్తున్నారు. దీంతో డివిజన్‌లో లైన్ల ఆధునీకరణ పనుల అనంతరం మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందించనున్నారు.



పూతలపట్టులో విద్యుత్ స్తంభం ఏర్పాటు

మెరుగైన విద్యుత్

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా లైన్ సర్వే నిర్వహించాం. వీటిలో సిబ్బంది గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నాం. పాతవైపోయిన స్తంభాలు, లైన్లను మారుస్తున్నాం. నెలరోజుల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయి.

– పద్మనాభపిళ్లై, ఈఈ, ట్రాన్స్‌కో

కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుకు ఆహ్వానం

చిత్తూరు రూరల్: కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా రచయితల నుంచి నవలలు ఆహ్వానించనున్నట్లు ఆ నిర్వాహకురాలు రామలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల రచయితలు ఈనెల 30వతేదీలోపు నవలలను రామలక్ష్మి నర్సింగ్ హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు అనే చిరునామాకు పంపాలని కోరారు. ఉత్తమ నవలలకు నగదు బహుమతి ఉంటుందని, జూన్ 6న జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా పది పరీక్షలు

పూతలపట్టు: మండలంలో పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని పూతలపట్టు, బండపల్లి, పి.కొత్తకోట పరీక్ష కేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్ తనిఖీ చేశారు. పూతలపట్టు కేంద్రంలో ఇద్దరు, బండపల్లిలో ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ప్రారంభోత్సవం

ఐరాల: మండలంలోని మద్దిపట్లపల్లె నుంచి కురప్పపల్లె వరకు 30 నూతన విద్యుత్ స్తంభాలను, వీధి దీపాలను స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ముదిగోళం సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రారంభోత్సవం చేశారు. కురప్పల్లె గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నిధులతో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

ప్రతి ఇంటి సంక్షేమమే లక్ష్యం

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఇంటి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని 34వ డివిజన్ న్యూబాలాజీ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సంబంధిత అధికారులతో గడపగడపకు తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో పాత కాలువలే ఉన్నాయని వాటి స్థానం కొత్తవి నిర్మించాలని ప్రాంతవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. శానిటేషన్ పనులు సకాలంలో చేయడం లేదన్నారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని, పాములబెడద ఎక్కువగా ఉందని నూతన విద్యుత్ స్తంభం, దీపం ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరారు. నివాసాల మధ్యలో సెల్ టవర్‌ను తొలగించాలని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. చివరిగా సచివాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. కార్పొరేటర్ మస్తానీ, డివిజన్ నాయకులు ప్రేమ్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కార్పొరేటర్లు చల్లముత్తు, పూర్ణ, నాయకులు రమణ, శేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఉమ్మడి చర్యలు

చిత్తూరు అర్బన్: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరపాలక సంస్థ, పోలీసు శాఖ ఉమ్మడిగా చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, కొత్త సిగ్నల్ లైట్లు, జీబ్రా క్రాసింగ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై కమిషనర్ గురువారం జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి, ఏఎస్పీ జగదీష్, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తిలతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ప్రధానంగా నగరంలోని రద్దీ ప్రాంతాలు, కూడళ్లు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో కొత్తగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, నిర్వహణ అంశాలపై మాట్లాడారు. అందుకోసం నగరపాలక సంస్థ తరఫున సహాయ, సహకారాలు అందిస్తామని కమిషనర్ తెలిపారు.

వేడుకగా పున్నమి గరుడసేవ

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ వరదరాజుల స్వామి పున్నమి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వరదరాజుల స్వామి వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. సత్యనారాయణ వ్రతం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి స్వామివారిని గరుడవాహనంపై కొలువు తీర్చి మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్ధగిరి క్షేత్రంలో...

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అర్చకులు అభిషేకం చేయించారు. రాత్రి ఆలయంలో ఉత్సవమూర్తి వీరాంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామి ఆలయం, పుష్కరిణి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.



గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంకితభావంతో సేవ చేయాలి

తవణంపల్లె: నర్సింగ్ విద్యార్థులు అంకిత భావంతో సేవ చేయాలని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లోకేశ్వరి పిలుపునిచ్చారు. ఆ కళాశాలలో గురువారం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేట పీఎస్‌సీ నగర పాలక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను గురువారం నగర కమిషనర్ అరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని, నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్, అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

సాగు చేసే భూములకు పట్టాలు ఇవ్వండి



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిట్టిబాబు

యాదమరి: సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వండి అంటూ గాంధీపురానికి చెందిన గ్రామస్తులు కోరారు. గాంధీపురానికి చెందిన కనమ్మ, అనితా, లావణ్య, మల్లిక, పాస్టర్, కవితా, రోశమ్మ ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్నారు. దీనిపై పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు కావాలని సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ చిట్టిబాబు గురువారం గ్రామానికి వెళ్లి స్థలాలు పరిశీలించారు. సాగు చేసినట్టు కనిపించక పోవడంతో ఆయన త్వరలో రీ సర్వే కాశిరాళ్ల పంచాయతీలో నిర్వహిస్తామని, ఆ సమయంలో హద్దులను గుర్తించి పట్టాలు ఇవ్వడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. అధికారుల వెంట స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లు ఉన్నారు.

పక్కాగా నమోదు

యాదమరి: గ్రామాల్లో ఉన్న గర్భవతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని మండల వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని దాసరాపల్లెలో గురువారం ఆయన గర్భవతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. మొదటిసారి గర్భవతి అయిన వారికి ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా యోజన పథకం కింద లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్సలు చేయించాలన్నారు. వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో గురువారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాలయంలో శ్రీసీతారామ సమేత లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తి, సీతమ్మ ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతమ్మ, రామయ్యల పరిణయాన్ని వేడుకగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కల్యాణోత్సవానికి తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు మధ్యాహ్నం అన్నదానం చేశారు. శుక్రవారం సీతారాముల గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రైతులకు పంట నమోదు పత్రాలు

బంగారుపాళెం: పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని నల్లంగాడు, శెట్టేరి రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆర్‌బీకేల్లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వేరుశెనగ పంటను పరిశీలించారు. పంటసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి పద్మజ, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



నల్లంగాడులో వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక

చిత్తూరు అర్బన్: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఆర్.జీ శ్రీకాంత్, సి.శోభ, బి.పూర్ణచంద్ర రావు, ఎ.జి.సహదేవన్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. ప్రధానంగా వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా బోరు మోటర్ల కొనుగోలు, పైపులైన్ లీకేజీల మరమ్మతులు చేయడానికి అవసరమైన మెటీరియల్ కొనుగోలు, ప్రధాన రహదారులపై ప్రవేశ తోరణాల ఏర్పాటుకు, నీరు తగ్గిన ప్రాంతాల్లో బోరుబావులను డ్రిల్ చేయడానికి అమృత్– 2.0 పథకం కింద మంజూరైన అన్ని రకాల ప్రాజెక్టులకు సంబంధించి డీటైయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయడానికి కమిటీ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో నగర అభివృద్ధిపై చర్చిస్తున్న అధికారులు

కారు ఢీకొని వలంటీర్‌కు తీవ్రగాయాలు



వినోద్ (ఫైల్)

గుడిపాల: మండలం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై కారు ఢీకొని ఇద్దరు తీవ్రగాయాల పాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు, చిత్తూరు మండలం తాళంబేడుకు చెందిన వినోద్‌కుమార్ (26), గుడిపాల మండలం వసంతాపురానికి చెందిన మరో రేణుకుమార్ (25) వలంటీర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ వేర్వేరు ద్విచక్ర వాహనాలపై వేలూరు వైపు బయల్దేరారు. బెంగుళూరు నుంచి చెన్నై వెళుతున్న కారు మొదట వినోద్‌కుమార్‌ను ఢీకొని, ఆ తరువాత డివైడర్‌ను ఢీకొని, ఇంకాస్త ముందు వెళుతున్న రేణుకుమార్‌ను కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్ తీవ్రంగా గాయపడడంతో, రేణుకుమార్ (25)స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కుమార్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

తవణంపల్లె: మండలంలో రైతు భరోసా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా అందుతున్న రైతు మరణించినట్లయితే, వారి వారసులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు తవణంపల్లె వ్యవసాయాధికారి, ఆర్‌బీకేల్లో సంప్రదించి పూర్తి వివరాలను అందజేయాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

పూతలపట్టు: మండలంలోని వ్యక్తి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు పాలకూరు పంచాయతీ ఎగువపాలకూరు ఎస్సీవాడకు చెందిన ఎస్ నాగరాజు (35) కూలీ. ఆర్థిక సమస్యలు ఉండడంతో బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై హరిప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ లాంఛనంగా ప్రారంభం

చిత్తూరు రూరల్: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలు మారుమూల పల్లెలోని గడప వద్దనే అందుతున్నాయని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు అన్నారు. రెండు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్తూరు మండలం చింతలగుంట క్లినిక్‌లో 104 వాహనానికి పూజలు చేసి, ఫ్యామిలీ ఫిజిషయన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇన్నాళ్లు ట్రయల్ రన్‌గా నడిచిన ఈ ఫ్యామిలీ డాక్టర్ ఇప్పుడు లాంఛనంగా ప్రారంభమైందని చెప్పారు. వైద్యాధికారులు, సిబ్బంది పల్లెలో వైద్య సేవలను పక్కాగా అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు సుదర్శన్, భాస్కర్, నాయకులు త్యాగరాజులు, అమర్‌నాథ్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, సాము, ప్రసాద్, సర్పంచులు తిలకమ్మ, గీత పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో..

గుడిపాల: మండలంలోని ఏఎల్‌పురం పంచాయతీలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలను బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రప్ప, సిబ్బంది శాంతకుమారి, శ్రీలక్ష్మి, సుమతి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

చిటిపిరాళ్లలో..

పూతలపట్టు: మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యులు గ్రామాన్ని నెలకు 2 సార్లు వెళ్లి, పరీక్షలు చేయాలని సూచించారు. డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త ఉంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు వైద్యులు బి.పి, షుగర్ పరీక్షలు చేశారు. 104 అంబులెన్సును ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఎంపీపీ కుమారి, వైస్‌ఎంపీపీ ద్వారకనాధ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూరి, వైద్యాధికారులు ప్రియంకా, ప్రవీణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.





చిత్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు: విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బోడబండ్ల గ్రామంలో..

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ హరి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర, నాయకులు చంద్రయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

పి.ఎర్రేపల్లిలో..

ఐరాల: మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పి.ఎర్రేపల్లె సచివాలయంలో వైద్యాధికారి చందన ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు శివయ్య, సిరాజుద్దీన్, పీహెచ్‌ఎన్ వేదవతి, ఏఎన్‌ఎం భువనేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ రోజా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎగువ మత్యంలో..

తవణంపల్లె: మండలంలోని ఎగువమత్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు ప్రారంభించారు.

పత్రపల్లెలో..

యాదమరి: మండలంలోని పత్రపల్లె ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ను మాదిరెడ్డి పల్లె వైద్యాధికారి శివకుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేసి మందులు అందించారు.

లక్ష్యాలను అధిగమించాలి

చిత్తూరు అగ్రికల్చర్: ఈ ఏడాదికి కేటాయించిన ఉపాధి లక్ష్యాలను అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. గురువారం కార్యాలయ సమావేశ మందిరంలో ఆశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గత ఏడాదికి జిల్లా వ్యాప్తంగా 84 లక్షల పని దినాల లక్ష్యాన్ని కేటాయించగా 93 శాతం సాధించినట్లు తెలిపారు. ఉపాధి ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదికి 85 లక్షల పని దినాలను కేటాయించారని, 65 శాతం వ్యవసాయ సంబంధిత పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

20న ప్రవేశ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఏపీ బాలికల మైనారిటీ గురుకుల పాఠశాల అడ్మిషన్లకు ఈనెల 20న ప్రవేశపరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 నుంచి 8 తరగతుల వరకు 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు మాత్రమే ఈ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు www. aprs. aperss. in వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9701889874 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.